నేడు జెడ్‌పి అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ అత్యవసర సమావేశం సోమవారం జరగనుంది. వైసిపి జెడ్‌పిటిసిల కోరిక మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. వైసిపి నుంచి గెలిచి జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఉన్న గంటా పద్మశ్రీ కొద్దిరోజుల క్రితం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దీన్ని వైసిపి జెడ్‌పిటిసిలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ ఫిరాయింపుల్లో భాగంగా పద్మశ్రీ జెడ్‌పిటిసి సభ్యత్వాన్ని రద్దుచేసే అనర్హులుగా ప్రకటించాలని వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు కోరుతున్నారు. దీనిపై జెడ్‌పి సిఇఒకు వినతిపత్రం సైతం ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌లో 48 జెడ్‌పిటిసి సభ్యులు ఉన్నారు. ఇందులో 46 చోట్ల వైసిపి సభ్యులు, ఇద్దరు టిడిపి, జనసేన సభ్యులు ఉన్నారు. రెండు రోజుల క్రితం 31 మంది వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు సమావేశమైన జెడ్‌పి ఛైర్‌పర్సన్‌పై తిరుగుబాటు చేసారు. అత్యవసర సమావేశంలో ఇదే ప్రధాన అజెండాగా కొనసాగనుంది. దీంతో జెడ్‌పి అత్యవసర సమావేశం వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది.

నామినేటెడ్ ఆశలు ఆవిరి

రెండో జాబితాలోనూ కీలక నేతలకు నిరాశే

తాజా, మాజీ టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని, తోటకు మొండిచేయి

ఎంఎల్ఎ టిక్కెట్ త్యాగం చేసిన నేతలకు దక్కని గుర్తింపు

ముద్రబోయిన, వలవల బాబ్జీకి ఝలక్

టిడిపి, జనసేనలోని పలువురు నియోజకవర్గ నేతల్లో అసంతృప్తి

తోట సీతారామలక్ష్మి


గన్ని వీరాంజనేయులు


ముద్రబోయిన వెంకటేశ్వరరావు


వలవల బాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నామినేటెడ్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్న నేతల ఆశలు ఆవిరయ్యాయి. రెండో జాబితాలోనూ రెండు జిల్లాల్లోని కీలక నేతలకు పదవులు దక్కకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఎంఎల్ఎ పదవులు త్యాగం చేసిన నాయకులను గుర్తించకపోవడంతో వారి అనుయాయుల్లో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం తొలి జాబితాలో కీలక కార్పొరేషన్లకు సంబంధించిన నామినేటెడ్ పదవులను ప్రకటించింది. మంతెన రామరాజు, పీతల సుజాత, బొరగం శ్రీనివాస్‌కు మాత్రమే అవకాశం దక్కింది. కీలక నేతలకు తొలిజాబితాలో చోటు దక్కకపోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. రెండో జాబితాలో అవకాశం దక్కుతుందని అంతా సరిపెట్టుకున్నారు. నామినేటెడ్ పదవులకు సంబంధించిన రెండో జాబితా శనివారం విడుదల చేశారు. సామాజిక వర్గాల సంక్షేమం, పలు అభివృద్ధి సంస్థలు, వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 62 కీలక పదవులను ప్రకటించడం జరిగింది. రెండు జిల్లాల్లో టిడిపి, జనసేనకు సంబంధించిన నలుగురు నేతలకు అవకాశం దక్కింది. టిడిపిలో కీలకనేతలుగా ఉన్నవారికి మాత్రం మరోసారి మొండిచెయ్యి మిగిలింది. ఎన్నికల వరకూ పశ్చిమగోదావరి జిల్లా టిడిపి జిల్లా ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించిన తోట సీతారామలక్ష్మికి ఇప్పటి వరకూ ఏ పదవీ దక్కకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. 2014–19 టిడిపి ప్రభుత్వంలో సీతారామలక్ష్మి రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, తర్వాత విభజిత పశ్చిమకు జిల్లా ఇన్‌ఛార్జిగా చాలాకాలం పనిచేసిన పరిస్థితి ఉంది. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. కీలకమైన నామినేటెడ్ పదవుల్లో ఆమెకు అవకాశం దక్కకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఆమెకు రాజ్యసభ, లేక ఎంఎల్‌సి పదవి ఏదైనా ఇస్తారా అన్న మరోచర్చ సైతం నడుస్తోంది. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్న గన్ని వీరాంజనేయులకు మరోసారి మొండిచేయి మిగిలింది. పొత్తులో భాగంగా ఆఖరు నిమిషంలో గన్ని ఉంగుటూరు ఎంఎల్ఎ టిక్కెట్ త్యాగం చేశారు. జనసేనకు ఆ టిక్కెట్ కేటాయించారు. దీంతో ప్రభుత్వం రావడంతోనే గన్నికి కీలక పదవి ఇచ్చే అవకాశం ఉంటుందని అంతా భావించారు. నామినేటెడ్ పదవులకు సంబంధించి రెండు జాబితాల్లోనూ గన్నికి నిరాశే మిగిలింది. గన్నికి పదవి ఇచ్చే ఉద్దేశం టిడిపి అధిష్టానానికి ఉందా అన్న అనుమానాలు నెలకొన్నాయి. న్యూజివీడు నియోజకవర్గ నేత ముద్రబోయిన వెంకటేశ్వరరావుకు టిడిపి ఝలక్ ఇచ్చింది. ముద్రబోయిన సైతం పొత్తులో భాగంగా ఎంఎల్ఎ టిక్కెట్ వదులుకోవాల్సి వచ్చింది. రెబల్‌గా నామినేషన్ వేసి అధిష్టానం బుజ్జగించడంతో వెనక్కి తగ్గి విత్‌డ్రా చేసుకున్నారు. ముద్రబోయినకు కీలకమైన నామినేటెడ్ పదవి దక్కుతుందని అంతా అనుకున్నారు. ఆయనకు పదవి దక్కకపోవడం న్యూజివీడు నియోజకర్గంలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ టిక్కెట్ ఆశించిన వలవల బాబ్జీకి పొత్తులో భాగంగా ఆఖరు నిమిషంలో సీటు దక్కలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆయనకు నామినేటెడ్ పదవి ఖాయమన్న చర్చ సాగింది. బాబ్జికి నిరాశే మిగిలింది. తమ నాయకులకు రెండో జాబితాలోనూ పదవి దక్కకపోవడంతో వారి అనుయాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

నిరాశలో పలు నియోజకవర్గ నేతలు..

నామినేటెడ్ పదవులు దక్కపోవడంతో టిడిపి, జనసేనకు చెందిన పలువురు నియోజకవర్గ నేతలు తీవ్ర నిరాశకు గురైన పరిస్థితి నెలకొంది. నరసాపురంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, జనసేన దెందులూరు నియోజవర్గ ఇన్‌ఛార్జి ఘంటసాల వెంకటలక్ష్మి వంటి ఇతర నేతలు ఉన్నారు. టిడిపి ఎంఎల్ఎలు గెలిచిన చోట జనసేన నేతలకు, జనసేన నేతలు గెలిచిన నియోజకవర్గాల్లో టిడిపి నేతలకు సరైన గుర్తింపు లేకుండా పోయిందంటూ ఇరుపార్టీల మధ్య తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. దెందులూరు, చింతలపూడి, తాడేపల్లిగూడెం నియోజవర్గంలో ఇవి తారాస్థాయికి చేరిన పరిస్థితి నెలకొంది. అధికారిక కార్యక్రమాల్లో తమకు గుర్తింపు ఉండడంలేదని, అధికారులు తమను పట్టించుకోవడం లేదంటూ నేతలు అసంతృప్తిలో ఉన్నారు. నామినేటెడ్ పదవులు దక్కితే అధికారులు తమను గుర్తిస్తారని నేతలు భావిస్తున్నారు. పదవులు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన పరిస్థితి నెలకొంది.

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

104 ఉద్యోగుల ధర్నాలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ధర్నా నిర్వహించారు. అయితే ఈ ధర్నా 104 ఉద్యోగులని అయినప్పటికీ ఉద్యోగులందరూ పాల్గొని ప్రభుత్వ విధానాలను ఎండగట్టి నిరసన తెలిపారు. పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తి ప్రారంభించి మాట్లాడారు. పాలకుల మారినా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పోరాటాలు, ఉద్యమాల ద్వారానే హక్కులు, వ్యవస్థలను కాపాడుకోవాలన్నారు. 104 ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘం పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ ఎవరు అధికారంలో ఉన్నా కాంట్రాక్టర్లకు లాభం చేసే విధంగానే 104 వ్యవస్థ నడుస్తోందన్నారు. 104 వ్యవస్థను ప్రభుత్వ విలీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్న ఈ వ్యవస్థను మెరుగుపరుస్తామని, ఎన్నికల్లో వాగ్దానం చేసిందని, 104 ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జిఒ 7ను అమలు చేయాలని, ఉద్యోగులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.విజయకుమార్, ఎస్.సురేష్, ఉపాధ్యక్షులు సుందర్ సింగ్ సీనియర్ ఉద్యోగి సత్యనారాయణ మాట్లాడుతూ 2008 నుంచి ఈ వ్యవస్థ నడుస్తున్నా ఇంతకాలం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు.గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ 104 ఉద్యోగుల పోరాటం విజయవంతం కావాలని, అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా పాలకులపై గళమెత్తాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ ఆంజనేయులు, సాయిరాం, ఆశోక్, నాగేంద్ర వెంకటరమణ దీప్తి పాల్గొన్నారు.

నివురుగప్పిన నిప్పే..!

జిల్లాలో అధికార, ప్రతిపక్షల పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి, వైసిపిల్లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. కూటమిలో పక్షాల మధ్య ఆధిపత్య పేరు నేతలకు తలనొప్పిగా పరిణమిస్తుండగా నామినేటెడ్ పదవుల పందేరం కూడా ఆయా పార్టీలకు ఇబ్బందికరంగానే ఉంది. ఎవరికి వారే తమకు పదవులు కావాలని ఎగబడుతుండడంతో జిల్లా, నియోజకవర్గస్థాయి నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇక వైసిపిలో ఎవరు ఎప్పుడు పార్టీని వీడతారో తెలియక ఎవరికి వారు అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలోనే భీమవరం మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఇళ్లు, కార్యాలయాలపై ఐటి దాడులు ఆ పార్టీలో కలకలం రేపుతున్నాయి.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ అంశం అటు వైసిపిలోనూ, ఇటు టిడిపిలోనూ కలకలం సృష్టిస్తోంది. ఏలూరు కార్పొరేషన్‌లో మేయర్‌తోపాటు మెజార్టీ వైసిపి కార్పొరేటర్లు టిడిపి గూటికి చేరితే ఎటువంటి ఇబ్బందీ లేనట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్‌తోపాటు వైసిపి జెడ్‌పిటిసిలు మెజార్టీ సంఖ్యలో టిడిపి గూటికి చేరి ఉంటే పెద్ద రచ్చ జరిగేది కాదు. అయితే జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఆమె భర్త మాత్రమే టిడిపి గూటికి చేరారు. ఈ వ్యవహారమూ మిత్రపక్షాలైన టిడిపి, జనసేన నడుమ మనస్పర్థలకు దారితీసింది. తొలుత జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు టిడిపిలో చేరాలని చూసినా ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పెదపాడు మండలానికి సంబంధించిన నియోజకవర్గ నేత అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయింది. ఈలోపు జనసేనలో చేరనున్నట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు అధికారికంగా ప్రకటించడం, దీనిపై టిడిపి అధినాయకులు అప్రమత్తమై ఇటు జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులతోపాటు ఆ నియోజకవర్గ ఎంఎల్ఎతోనూ మంతనాలు జరిపి ఇరువురిని ఒప్పించారు. దీంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు టిడిపి గూటికి చేరారు. తమ పార్టీలో చేరేవారిని అడ్డుకుని మీ పార్టీలో చేర్చుకోవడమేంటని జనసేన శ్రేణులు టిడిపి నేతలపై అసంతృప్తి వ్యక్తం చేశాయి. తర్వాత నియోజకవర్గస్థాయిలో ఇరు పార్టీల నేతల మధ్య ఆధిపత్య పోరు పెరిగింది. నామినేటెడ్ పదవులతోపాటు మద్యం దుకాణాలు, బెల్టుషాపుల విషయంలో రచ్చ చోటుచేసుకుంది. అయితే ఇరుపక్షాలు విమర్శ ప్రతివిమర్శలకు దిగకుండా సంయమనం పాటిస్తున్నారు. దీంతో టిడిపి, జనసేన మధ్య సఖ్యత నివురుగప్పిన నిప్పులా మారిందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక వైసిపిలోనూ పరిస్థితి అలానే ఉంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పూర్తి నైరాశ్యంలో కూరుకుపోయిన ఆ పార్టీ శ్రేణులు ఇప్పుడు ఎప్పుడూ ఎవరు పార్టీని వీడతారో తెలియక, మరోపక్క ఎవరిపై అధికారపక్షం నుంచి ఎటువంటి దాడులు జరుగుతాయో అర్థంగాక తలలు పట్టుకుంటున్నాయి. వైసిపికి చెందిన మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పార్టీ మారతారనే ప్రచారం సుమారు రెండు నెలలుగా సాగుతోంది. దీనిపై వైసిపి మాజీ మంత్రులు కూడా రంగంలోకి దిగి గ్రంధి శ్రీనివాస్‌ను బుజ్జగించేందుకు ప్రయత్నించారు. అయినా గ్రంధి టిడిపి వైపు అడుగులు వేసినట్లు సమాచారం. టిడిపి అధిష్టానం గ్రంధి చేరికకు ఆమోదం తెలిపినా పదవి కేటాయింపుపై సందిగ్ధత నెలకొన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదే సమయంలో గ్రంధి ఇల్లు, వ్యాపార సముదాయాలపై, ఆయన సన్నిహితులుగా పేరొందిన వ్యాపారుల ఇళ్లపై ఐటి అధికారులు దాడులు నిర్వహించడం కలకలం రేపింది. పైగా మూడు రోజులుగా ఐటి అధికారులు నిర్బంధ తనిఖీలు సాగించడం చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితులు వైసిపి నేతలను, కార్యకర్తలను తీవ్ర కలవరానికి గురి చేస్తున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పేదలపై యుద్ధమా..!

పశ్చిమగోదావరి జిల్లా మండల కేంద్రమైన ఆకివీడులోని ఐ.భీమవరం రోడ్డులో రోడ్డు పక్కనే ఇళ్లు వేసుకుని దశాబ్దాలకాలంగా జీవనం సాగిస్తున్న పేదలపై కూటమి ప్రభుత్వం, నేతలు యుద్ధం ప్రకటించినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపకపోవడం, చూపిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పేదలు తమ ఇళ్ల తొలగింపుకు మూడు నెలలు గడువు కోరారు. దీనిపై నగర పంచాయతీ ప్రజాప్రతినిధుల నుంచి ఎంఎల్ఎ వరకూ, ఆ నగర పంచాయతీ కమిషనర్ నుంచి కలెక్టర్ వరకూ అందరినీ కలిసి వినతులు అందించి తమ గోడు చెప్పుకున్నారు. ఏమైందో ఏమోగాని పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండానే పేదల ఇళ్ల తొలగింపు చేపట్టారు. దీన్ని పేదలు సిపిఎం ఆధ్వర్యాన అడ్డుకోవడంతో అధికారులు వెనక్కితగ్గారు. అయితే ఎలాగైనా పేదల ఇళ్లు కూల్చివేయాలనే ఆలోచనతో ఎంఎల్ఎ ఆదేశాలతో విద్యుత్ శాఖాధికారులు ఆయా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. వారేమీ సంఘ విద్రోహులు కాదు.. పరాయి దేశస్తులు అంతకన్నా కాదు.. అక్కడే పుట్టి నివసించేందుకు జాగా లేక రోడ్డు పక్కన గుడిసె వేసుకుని జీవిస్తున్న నిరుపేదలు వారు. అవేమీ పట్టని కూటమి పాలకులు అత్యంత అమానవీయంగా ఇళ్లకు కరెంటు కట్ చేసి నిరుపేదలను అక్కడ నుంచి తరిమేసే ప్రయత్నం చేయడం అత్యంత బాధాకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

– వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

ప్రభుత్వాల తీరు సిగ్గుచేటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుంటే అడగాల్సింది పోయి కూటమి ప్రభుత్వం కళ్లప్పగించి చూడడం సిగ్గుచేటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. భీమవరంలో 9వ సిపిఎం పట్టణ మహాసభ ఆరో వార్డు బొక్కావారి పాలెం జయరాం కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యవక్తగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం లేని చేతగానిది కూటమి ప్రభుత్వమన్నారు. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అక్కడ కార్మికులు, ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తుంటే కనీసం చీమకుట్టినట్టు కూడా ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఒకవైపు రాష్ట్రంలో చంద్రబాబునాయుడు తమ ప్రభుత్వం వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.20 వేల కోట్లు ప్రజల నెత్తిన భారాలు వేస్తున్నారని విమర్శించారు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ ఈ మహాసభల అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరు నినాదంతో ప్రజల్లోకి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా వాటిపై చర్చించి ఆమోదించారు. అనంతరం నూతన కార్యదర్శిగా డి.వాసుదేవ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే తొమ్మిది మందితో నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో అధ్యక్ష వర్గంగా సిపిఎం నాయకులు బొక్కా సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, బి.వరలక్ష్మి వ్యవహరించారు. సిపిఎం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, చైతన్య ప్రసాద్, డి.నాగు, కె.కృష్ణ, కె.వెంకటేశ్వరరావు, సిహెచ్ వరలక్ష్మి, శ్రీదేవి, వరలక్ష్మి, డి.త్రిమూర్తులు, పట్నాలు రేణుక, జి.అనసూయమ్మ, కొమరగిరి సాయమ్మ, బి.శాంతకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. తొలిరోజు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. దీంతో జిల్లా అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. చింతలపూడి, తాడిపూడి సాగునీటి ప్రాజెక్టులకు, పోలవరం నిర్వాసితుల సమస్య, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం, ఫిషింగ్ హార్బర్, డెల్టా ఆధునికీకరణకు నిధులు కేటాయింపుపై, ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహాలపైనే జిల్లా ప్రజానీకం గంపెడాశలు పెట్టుకున్నారు.

ఏలూరు మెడికల్ కాలేజీకి ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు మెడికల్ కాలేజీకి ఎల్లా ప్రగడ సుబ్బారావు పేరు పెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విభాగాల్లో కీలక ఆవిష్కరణలు చేసిన ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు. ఆయన స్వస్థలం భీమవరం, రాజమండ్రిలో చదువుకున్నారు. దీంతో కొత్తగా ఏర్పాటైన ఏలూరు, రాజమండ్రి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఒక దానికి ఆయన పేరు పెట్టాలని ఇటీవల డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కోరారు. అందులో భాగంగానే ఏలూరు మెడికల్ కాలేజీకి ఆయన పేరు పెట్టినట్లు తెలుస్తోంది.

ప్రజలపై భారాలు దారుణం : సిపిఎం

ప్రజాశక్తి - నరసాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బాధలు తీరుస్తారని ఎన్నుకుంటే ప్రజలపైన మరిన్ని భారాలు మోపుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. స్థానిక పట్టణంలో ఎన్‌టిఆర్ కాలనీలో తాపీ పని వారు భవనంలో సిపిఎం 25వ పట్టణ మహాసభలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా మహాసభల సూచికగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించుకుని అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రారంభమైన మహాసభకు అధ్యక్షులుగా మంచిలి నీలకంఠం, బూడిద భువనేశ్వరి వ్యవహరించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలను కష్టాల నుంచి, బాధల నుంచి గట్టెకిస్తారనుకున్న ప్రజలపై ధరల భారాలు, విద్యుత్ భారాలు మోపుతున్నారన్నారు. మరొకపక్క కొత్త మద్యం పాలసీతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇసుక సమస్యతో నిర్మాణరంగం కుదేలైందన్నారు. నిర్మాణ రంగంకు అనుబంధంగా ఉన్న లక్షలాదిమంది కార్మికులకు రోజువారి పనులు జరగక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణం ప్రజలకు ఉచిత ఇసుకను అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే విధంగా జమిలి ఎన్నికల విధానాన్ని ముందుకు తీసుకొస్తుందని దీని ప్రమాదాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మహాసభ నివేదికను ప్రవేశపెట్టారు. గత కాలంలో జరిగిన ఉద్యమాలు, పోరాటాలు సమీక్ష చేసుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకునే విధంగా మహాసభలో చర్చించుకుని తీర్మానాలను ఆమోదించుకున్నారు. మూడవసారి పట్టణ కార్యదర్శిగా ముచ్చర్ల త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు, నోములకొండ, పొగాకు నారాయణరావు, జిల్లా కమిటీ సభ్యురాలు పొగాకు పూర్ణ, కోడి లక్ష్మణ్, కోరాడు బద్రి, గుత్తుల సాగర్, కవురు నరసింహ స్వామి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపోరులో సిపిఎం నాయకులు

గణపవరం : ప్రజాపోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గణపవరం

కేంద్రంలో మోడీ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ, జమిలి ఎన్నికల అంశాన్ని ముందుకు తెచ్చి ప్రజాసమస్యలు పక్కకు నెట్టేస్తున్నారని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజాపోరు పిలుపులో భాగంగా ప్రజాపోరు వాల్‌పోస్టర్‌ను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ధరలు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయన్నారు. ఉపాధి మాత్రం రోజురోజుకీ దిగజారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి పి.నరశింహమూర్తి, గణపవరం శాఖా కార్యదర్శి ఎం.పెంటారావు మాట్లాడారు. 14న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు, 15వ తేదీన భీమవరంలో జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చిన్నం చిననాగేశ్వరరావు, సోడదాసి సంజీవిరావు పాల్గొన్నారు.

తణుకు : జయంతి కాలనీలో నిరుపేదలైన యానాదులకు ప్రభుత్వం పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా జయంతి కాలనీలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం కట్టించిన ఇళ్లలో అనేక దశబ్ధాలుగా యానాదులు నివాసం ఉంటున్నారని తెలిపారు. నేడు ఆ ఇళ్లు కూలిపోవడం, స్లాబులు పడటం వల్ల చాలా మందికి తలకి, కాళ్లకి దెబ్బలు తగలడం వంటివి నిత్యం జరుగుతున్నాయన్నారు. ఇళ్ల సమస్యలపై వచ్చిన ప్రతీ ప్రభుత్వానికి కింద నుంచి పైకి అధికారులకు ఎన్నో సార్లు విన్నవించినా ఫలితం లేదని విమర్శించారు. కూటమి నేతలు, అధికారులు యానాదులకు ప్రభుత్వ గృహాలు కట్టించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 14వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, కొండయ్య, శ్రీను, వరలక్ష్మీ, బుజ్జి, దుర్గప్రసాద్, వెంకటేశ్వరరావు, దానయ్య పాల్గొన్నారు.

తణుకు : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలపై ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచిందని ఇరగవరం సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి అన్నారు. ప్రజాపోరులో భాగంగా ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామంలో సిపిఎం కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ఇరగవరం మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపాడు సిపిఎం శాఖా కార్యదర్శి పిల్లి కోటేశ్వరరావు, పెద్దిరాజు, తోరం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : గత ప్రభుత్వానికన్నా భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలు చేయాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక 8, 11 వార్డుల్లో సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాపోరు పేరుతో రెండో రోజు ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలపై పడుతున్న భారాలపై ప్రజలకు వివరించారు. వీటికి వ్యతిరేకంగా ఈనెల 14న మండల కేంద్రాల్లో, 15వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనలో అధిక సంఖ్యలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని వీరభద్రరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, అంబటి రామకృష్ణ, కుడకా వీరభద్రరావు, వాసా పోసియా, అల్లం శ్యామ్, తాళ్ల సత్యనారాయణ, బొక్క మోహన్ రావు, విశ్వనాథం సుబ్బారావు, కరేళ్ల అర్జున్, రుద్రాక్ష శ్రీనివాస్ పాల్గొన్నారు.

తణుకు : ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

పాలకొల్లు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ప్రజాపోరు కార్యక్రమం చేపట్టిందని పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక వీవర్స్ కాలనీ, షుగర్ కాలనీ, చింతల తోటలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేస్తూ కార్మికులను తొలగించడం, బలవంతపు విఆర్ఎస్‌లు ఇవ్వడం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకపోవడం దారుణమన్నారు. ప్రజా సమస్యలపై పోరాటంకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లా సోమేశ్వరరావు, పెంద్రిడ్ సాంబశివరావు, వై.రాము పాల్గొన్నారు.


పాలకొల్లు : కరప్రతాలను పంపిణీ చేస్తున్న నాయకులు

తెలుగు సాహిత్యాభివృద్ధికి బ్రౌన్ విశేష కృషి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేష కృషిచేసిన ఆంగ్లేయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని, తొలి తెలుగు శబ్దకోశమును ఈయనే పరిష్కరించి ప్రచురించాడని బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్ అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్‌లో సిపి బ్రౌన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూటన్ మాట్లాడుతూ బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికీ తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తారని, తెలుగు జాతికి సేవ చేసిన నలుగురు ఆంగ్లేయులలో ఒకరిగా బ్రౌన్‌ను పరిగణిస్తారని అన్నారు. తెలుగు పండితులు కలిగోట్ల గోపాల శర్మ మాట్లాడుతూ ఆంధ్ర భాషోద్ధారకుడు అని గౌరవించబడిన మహానుభావుడు అని అన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 'ఆంధ్ర మహాభారతము', 'శ్రీమద్భాగవతము'లను ప్రచురించాడని, తెలుగు నేర్చుకునే ఆంగ్లేయులకు వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాసారని అన్నారు. డి.రామ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

మాట్లాడుతున్న వాసవీక్లబ్ అధ్యక్షులు బ్రహ్మం

'ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి'

ప్రజాశక్తి - నరసాపురం

మనమందరం ఐక్యంగా ఉన్నప్పుడే సంఘం సమస్యల్ని పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు సి.సుబ్రహ్మణ్యం, వాసవీక్లబ్ అధ్యక్షులు ఎన్.బ్రహ్మం అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో ఆర్యవైశ్య కార్తీక సమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. పేద ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. వ్యాపార పరంగా ఆదుకోవాలని సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులతో విచ్చేసి సరదాగా గడిపారు. పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నూలి శ్రీనివాస్, కొట్ల బాలకృష్ణ, కొట్ల సుధాకర్, శిరం రమేష్, శ్రీరంగనాయకులు, కొట్ల వెంకట సత్యనారాయణ, రవికుమార్, శ్యామల పాల్గొన్నారు.

'దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి - నరసాపురం

నామినేటెడ్ పదవుల్లో దేవాంగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కృష్ణబాబు కాలనీలో ఏర్పాటు చేసిన దేవాంగుల కార్తీక సమారాధనకు ముఖ్య అతిథులుగా వల్లెం గణేశ్వరరావు, ఆనంద ప్రసాద్, శివశంకర్, బొమ్మన దుర్గాప్రసాద్‌లు విచ్చేసి విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వహయాంలో చేనేత, దేవాంగులకు ఒక కార్పొరేషన్ ఉండేదన్నారు. అయితే ఎన్నికల హామీల్లో ప్రత్యేకంగా వీటిని విడగొట్టి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది దేవాంగులు ఉన్నారన్నారు. ప్రభుత్వం రెండు రోజుల క్రితం ప్రకటించిన కార్పొరేషన్ పదవుల్లో అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యం కల్పించి దేవాంగులకు ప్రకటించకపోవడం ఆ సామాజికవర్గాన్ని నిరాశకు గురి చేసిందన్నారు. త్వరలో ప్రభుత్వం తమకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో అల్లంకి నాగేశ్వరరావు, మావూరి ఆనందకుమార్, రత్నకుమార్, రవి, ఆర్.భాస్కరరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం శాఖ యుటిఎఫ్ మండల మహాసభను, స్వర్ణోత్సవ సంబరాలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పిడిఎఫ్ బలపరచిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, జిల్లా సహాధ్యక్షులు రాజశేఖర్ పాల్గొన్నారు. ముందుగా మండలంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు భానుమూర్తి, చల్లా ఆదినారాయణ, జలజారాణి, గోవిందరాజులకు స్వర్ణోత్సవాల సందర్భంగా సత్కరించారు. అనంతరం జరిగిన శాఖ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎన్ఎస్.ప్రసాద్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ముద్దాల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, కుమార్ బాబ్జీ, సాయిబాబు, రమణ, పుల్లారావు, శ్రీకృష్ణ, శ్రీదేవి, శ్రీనివాస్, హరికృష్ణ, శ్రీనివాస్, రాజు రామకృష్ణమూర్తి, దుర్గారావు, అప్పయ్య పాల్గొన్నారు.

ఉల్లాసంగా కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం రుస్తుంబాదలో శ్రీఉమా రామలింగేశ్వర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ సతీమణి సునీత నాయకర్ పాల్గొన్నారు. మహిళలు ఆటపాటలతో అలరించారు. మహిళలకు ప్రత్యేకంగా ఆటల పోటీలు పెట్టి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వలవల నాని, బండెల రవీంద్ర, వట్టిప్రోలు సతీష్, బాసిన కోటి, కౌన్సిలర్ తోట అరుణ, కొప్పాడ కృష్ణవేణి, మల్లెపూడి జ్యోతి, మావూరి ఆనంద్ పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరించాలని బాధితుల నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక ఐ.భీ మవరం రోడ్లో నోటీసు లేకుండా రోడ్డుపక్క గృహాలకు విద్యుత్ కోత విధించడంతో బాధితులు విద్యుత్ కార్యాలయానికి చేరారు. సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు గత మూడు రోజులుగా తమకు కరెంటు ఇవ్వాలంటూ వారు తెల్లవారే వరకు విద్యుత్ కార్యాలయంలోనే గడిపి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి కూడా కార్యాలయానికి చేరారు. ప్రస్తుతం సబ్ స్టేషన్ వద్ద కార్యాలయంలోనే రాత్రి గడుపుతామని వాళ్లుఅంటున్నారు. విద్యుత్ ఇచ్చే దాకా ఇదే తరహాలో కొనసాగుతామని హెచ్చరించారు.

సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నేరాలు - ఘోరాలు

వివాహితపై భార్యాభర్తల దాడి

ఉండి : స్పందనలో తన భర్తపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని వివాహితపై భార్యాభర్తలు దాడి చేసిన సంఘటన ఉండిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఉండి పోలీసుల అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి శివారు రామాపురం ప్రాంతానికి చెందిన పూసలపాటి శాంతకుమారి అనే వివాహితను వేధిస్తున్నట్లు ఉండి గ్రామానికి చెందిన దువ్వి సూరిబాబుపై ఇటీవల స్పందనలో శాంతకుమారి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని దువ్వి సూరిబాబు, అతని భార్య దువ్వి జ్యోతి ఈనెల 8వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో శాంత కుమారి ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేసి, గొడవ పడి గాయపరచగా భీమవరం ఆస్పత్రిలో చేరిన శాంత కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ మహమ్మద్ నశీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కార్తీక వేళ.. ఆనంద హేల..

గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యాటకుల సందడి
పచ్చటి లంక భూముల్లో వన సమారాధనలు

ఆహ్లాదకరంగా ఉన్న కొబ్బరితోటలు

ప్రజాశక్తి - ఆచంట

కార్తీకమాసం వచ్చిందంటే ఆచంట మండలంలో వశిష్ట గోదావరి పరివాహక ప్రాంతం పర్యాటకులతో కళకళలాడుతుంది. గోదావరి నుంచి వీచే చల్లటి గాలులు, కొబ్బరి తోటల నడుమ ఆహ్లాదకర వాతావరణంతో ఈ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. మండలంలోని పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం గ్రామాల పరిధిలో గోదావరి తీరం వెంబడి ఉన్న లంక భూములు కార్తీక వన సమారాధనలకు నిలయాలుగా మారిపోతాయి. దూరప్రాంతాల నుంచి యువత, విద్యార్థులు, కుటుంబాలు, సంఘాలు వన సమారాధన కోసం ఇక్కడికి విచ్చేస్తారు. కోడేరు, కరుగోరుమిల్లి ప్రాంతాల్లో కొబ్బరి తోటలు భారీ వన సమారాధనల నిర్వహణకు అణువుగా ఉంటాయి.

మాసేనమ్మ ఆలయం..

ప్రసిద్ధిగాంచిన మాసేనమ్మ ఆలయ ప్రాంగణం భక్తికి, ఆహ్లాదకర వాతావరణానికి చక్కటి ప్రదేశంగా పేరుగాంచింది. పెదమల్లంలోని గోదావరి తీరంలో ఉన్న ఈ ఆలయానికి కార్తీకమాసంలో దూర ప్రాంతాల నుంచి సైతం యాత్రికులు విచ్చేస్తారు. ఆలయ ప్రాంగణమంతా పచ్చటి కొబ్బరి చెట్లు ఉండడంతో వన భోజనాలకు, విద్యార్థులకు ఆటపాటలకు అన్ని విధాల అణువుగా ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజనాలు, వంటలు ఏర్పాటు చేసుకోవడానికి సౌకర్యంగా గదులు అందుబాటులో ఉంటాయి.

గోదావరి పరివాహక ప్రాంతం

తస్మాత్ జాగ్రత్త..

ఈ ప్రాంతంలో పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోకుంటే ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా గోదావరి నదిలో స్నానాలు చేయాలనుకునేవారు అప్రమత్తంగా ఉండాలి. తీరం వెంబడి గోదావరి పాయ లోతుగాను, బురదమట్టితో ప్రమాదకరంగా ఉంటుంది. తీరం వెంబడి ఆటపాటలతో సంతోషంగా గడపాలే తప్ప నదిలో స్నానాలు చేయాలనుకోవడం అంత శ్రేయస్కరం కాదు. గతంలో ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి పలువురు మరణించిన విషాద సంఘటనలూ ఉన్నాయి.

గోపీమూర్తికి ఎపిటిఎఫ్-1938 మద్దతు

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి ఎపిటిఎఫ్ -1938 ఉపాధ్యాయ సంఘం తరపున మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. ఈమేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఏలూరు, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఎపిటిఎఫ్-1938 జిల్లా శాఖల తీర్మానాల మేరకు ఉపాధ్యాయ, విద్యా సమస్యలపై నిరంతరం పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి మద్దతు ప్రకటించాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి నిర్ణయించినట్లు రమణ తెలిపారు. ఉపాధ్యాయ విద్యా సమస్యలపై ప్రభుత్వానికి నిరంతరం తన గళాన్ని వినిపించే గోపీమూర్తిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, ఎపిటిఎఫ్-1938 కార్యకర్తలు, ఉపాధ్యాయులు విజయానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఇసుక

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఉచిత ఇసుకను వినియోగదారులకు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో తూర్పుగోదావరి జిల్లా తిప్పర్రు - 2, 3, ఔరంగాబాద్ రీచ్‌ల ద్వారా ఇసుకను పొందేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వినియోగదారుడు ఉచిత ఇసుకను పొందుటకు ఇసుక వెలికితీత, లోడింగ్, అంతర్గత రవాణా, అన్‌లోడింగ్, ఇసుక రీచ్‌ల నిర్వహణ చార్జీలు, జిఎస్‌టితో కలిపి టన్ను ఒక్కింటికి తిప్పర్రులో రూ.96.02, ఔరంగాబాద్‌లో రూ.229 చెల్లించాల్సి ఉందని, దీనికి రవాణా చార్జీలు అదనం అన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ట్రాన్స్‌పోర్ట్‌తో చర్చించి వినియోగదారుడికి నష్టంలేని విధంగా రవాణా చార్జీలను నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఇసుక రవాణా వాహనంకు జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఇసుక ఫెసిలిటేషన్ సెంటర్ నెంబర్లకు 93914 45753, 86682 91997, 81869 39223, 95501 75144, 80991 99883, 91820 37274లకు ఫోన్ చేసి పొందవచ్చునని తెలిపారు. సంబంధిత వాహనంలో వినియోగదారుడు నేరుగా రీచ్‌కు చేరుకుని ఆధార్ కార్డు ద్వారా ఉచిత ఇసుకను టన్ను ఒక్కింటికి నిర్దేశించిన చార్జీలను చెల్లించి పొందవచ్చునని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సముద్ర కెరటాలలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్‌లోని బీచ్ ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది. కార్తీకమాసం రెండో ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల మీద బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతోను, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. బీచ్‌లో లోపలికి ఎవరూ వెళ్లకుండా భారీకేట్ల ఏర్పాటు చేసి వాటి వద్ద గజఈత గాళ్లను నియమించారు. చిన్నా,పెద్ద తేడా తెలియకుండా బీచ్ ఒడ్డున కబడీ, క్రికెట్ తదితర ఆటలు ఆడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు. పర్యాటకులకు ఎటువంటి సంఘటనలూ జరగకుండా పోలీస్ రెవెన్యూ, పంచాయతీ, ఫిషరీస్, వైద్య ఆరోగ్యం తదితర శాఖల సిబ్బంది బీచ్‌లో విధులు నిర్వహించారు.

బీచ్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
ఆర్‌డిఒ దాసిరాజు

బీచ్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. కార్తీకమాసం ఆదివారం సందర్భంగా ఆయన పేరుపాలెం, కేపీ పాలెంలోని బీచ్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బంది విధులని పర్యవేక్షించాలని తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణిలకు సూచించారు.

ఉద్యోగులకు ఐఆర్‌ను ప్రకటించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి రాజగోపాల్

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు 12వ పేరివిజన్ కమిటీని నియమించి వెంటనే ఇంటీరియం రిలీఫ్(ఐఆర్)ను ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర) ఆవరణలో తణుకు జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ బకాయిలు పడిన డిఎలను ప్రకటించాలని, బకాయిపడిన పిఆర్‌సి, ఏరియర్లను, కరువుభత్యం ఏరియర్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, అపార్ నమోదు కార్యక్రమం ఏప్రియల్ నెల వరకు పొడిగించాలని, రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణా కార్యక్రమాలను పూర్తిగా రద్దు చేయాలని, ఉపాధ్యాయుల సమయాన్ని వృధా చేయరాదని, ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్స్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.రామమోహన్, కె.రామ్‌ప్రసాద్, ఎన్.జయరాజు, కె.అంజిబాబు పాల్గొన్నారు.

కౌలురైతుల హామీలు అమలు చేయాలి

కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో కౌలురైతులకు ఓటుహక్కు కల్పిస్తున్నామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు కోరారు. తక్షణం మండల, గ్రామస్థాయి అధికారులకు పూర్తి స్థాయిలో ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలురైతులకు జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలన్నారు. గత సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలురైతులకు తప్పనసరిగా ఓటు వేసే హక్కు కల్పిస్తున్నామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఎన్నికలపై ప్రకటనలు చేస్తున్న తహశీల్దార్లు కౌలురైతుల ఓటుహక్కుపై ఎలాంటి ప్రకటనలూ చేయడంలేదన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారని, కేవలం భూయజమానుల పేర్లే పరిశీలించి వాటర్ లిస్టులు తయారు చేస్తున్నారని తెలిపారు. తక్షణం కౌలురైతులను గుర్తించి వాటర్ లిస్టులో చేర్చాలని, కౌలురైతులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటు వేసేలా తగు చర్యలు తీసుకోవాలని కింద స్థాయి అధికారులకు ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు.

ఎంఆర్‌కెకు మరో మణిహారం

రూ.5 లక్షలతో రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు

ప్రజాశక్తి - వీరవాసరం

ఎంతో మంది ప్రముఖులను అందించిన వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మరో మణిహారంగా రన్నింగ్ ట్రాక్ సమకూరింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం శ్రీ పథకం ద్వారా రూ.ఐదు లక్షలతో రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్, పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పిఎస్ఎన్.మల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. జిల్లాలో ఇరవై ఐదు పాఠశాలలకు అక్కడ ఆట స్థలం విస్తీర్ణం బట్టి రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, కబడ్డీ కోర్టులు ఏదో ఒకటి ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఇందులో భాగంగానే వీరవాసరం హైస్కూల్‌కు విశాలమైన ఆటస్థలం ఉండటంతో రన్నింగ్ ట్రాక్‌కు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఐదు మీటర్ల వెడల్పు, రెండు వందల మీటర్ల పొడవుతో ఏర్పాటవుతున్న ఈ రన్నింగ్ ట్రాక్‌తో క్రీడాకారులకు ఎంతో మేలు జరగబోతుంది. ఎంతో మంది యువకులు పోలీస్ ఉద్యోగాలకు రన్నింగ్ ప్రాక్టీస్‌కు, ఆరోగ్యం కాపాడుకోవడంకు ప్రతీ రోజు అనేక మంది ఇక్కడకు వస్తూ ఉంటారు. నేలకు ఎనిమిది అంగుళాల ఎత్తులో ఈ రన్నింగ్ ట్రాక్‌ను నిర్మించడంతో పాటు పై పొరగా పుట్టుమన్ను వేయడం వల్ల క్రీడాకారులకు ఎంతో అనువుగా ఉంటుందని మల్లేశ్వరావు తెలిపారు.

హైస్కూల్‌లో వేగంగా జరుగుతున్న రన్నింగ్ ట్రాక్

బలరామరాజు సేవలు ఎనలేనివి


బలరామరాజు చిత్రపటానికి నివాలర్పిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామ మాజీ సర్పంచి గోకరాజు బలరామరాజు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. జువ్వలపాలెం గ్రామంలో ఆదివారం గోకరాజు బలరామరాజు మొదటి వర్ధంతి సభ నిర్వహించారు. జువ్వలపాలెం గ్రామ అభివృద్ధి ప్రధాత, జువ్వలపాలెం బలరామరాజు నగర్ సిబిసిఎన్‌సి స్టార్ ఆఫ్ హెూప్ బాప్టిస్ట్ చర్చి స్థలదాతగా గోకరాజు బలరామరాజు విశేష సేవలు అందించారు. మూడు దశాబ్దాలుగా పేద ప్రజలు, గ్రామాభివృద్ధి కోసం ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనేక సామాజిక కార్యక్రమాలు చేసి పేదలకు సహాయం చేశారు. సిబిసిఎన్‌సి బలరామరాజు నగర్ స్టార్ ఆఫ్ హెూప్ బాప్టిస్ట్ చర్చి సంఘం, సంఘ పెద్దలు, చర్చి కమిటీ, సంఘ నాయకులు గోకరాజు బలరామరాజుకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోకరాజు వంశీ బలరామరాజు, మండల కో ఆప్షన్ సభ్యుడు గుర్రం జార్జ్ బెనహర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ కృషి

ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందని ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. మొగల్తూరులోని పాతకాల సెంటర్ ప్రాంతాల్లో ఉన్న యుటిఎఫ్ భవనంలో నిర్వహిస్తున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక స్పృహ కలిగిన సంఘంగా యుటిఎఫ్ ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలకు అండగా నిలిచిందన్నారు. కరోనా సమయంలో రూ.3 కోట్ల విరాళాలతో ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. యుటిఎఫ్ భవనాలలో కరోనా బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించామని ఆయన తెలిపారు. శాసనమండలికి యుటిఎఫ్, దాని మిత్రపక్షాల ఆధ్వర్యంలో 10 నియోజకవర్గాల్లో పోటీ చేసి ఎనిమిది చోట్ల విజయం సాధించామన్నారు. అధికార ప్రతిపక్షాలకు తలవంచకుండా పిడిఎఫ్‌గా ఏర్పడి విద్య, ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో పోరాటం నిర్వహిస్తున్నారన్నారు. తనకు సుమారు 13 సంవత్సరాల సర్వీస్ ఉండగానే యూనియన్ ఆదేశాల మేరకు వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార ఉద్యమంలో పాల్గొంటున్నానని అన్నారు. ఉభయగోదావరి జిల్లాలలో ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎంఎల్‌సి షేక్ షాబ్జి మృతితో ఏర్పడిన ఖాళీ భర్తీకి జరుగుతున్న ఎన్నికల్లో యుటిఎఫ్, దాని మిత్రపక్షాల తరుపున తనను పోటీకి నిలిపారన్నారు. ఉపాధ్యాయ, అధ్యాపక సంబంధిత ఓటర్లందరూ తనకు మొదట ప్రాధాన్యతా ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రరావు, సిహెచ్.పట్టాభిరామయ్య, బి.కృష్ణకుమారి, చింతపల్లి కృష్ణమోహన్, సిహెచ్.శ్రీనివాస్, జి.లక్ష్మీనారాయణ, కె.బ్రహ్మయ్య ఉన్నారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

ఆర్‌టిసి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి

నరసాపురం : ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పంచారామ క్షేత్రాలకు బయలుదేరుతున్న బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా పంచారామాలు దర్శించుటకు నరసాపురం డిపో నుంచి పంచారామాలకు ఒక సూపర్ లగ్జరీ, మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపబడుచున్నామన్నారు. ఈ కార్తీకమాసం అంతా ప్రతి ఆదివారం పంచారామాలకు బస్సులు నడుపుచున్నామన్నారు. ఆదివారమే కాకుండా ఏరోజునైనా సరే యాత్రికులకు నరసాపురం డిపో నుంచి బస్సులు నడుపుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. నరసాపురం నుంచి బయలుదేరి అమరావతి, అమరావతి నుంచి సామర్లకోట, ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు, ఐదు పుణ్యక్షేత్రాలు ఒకేరోజు దర్శించుటకు అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ టి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

మైకుసెట్ అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గ్రంథాలయానికి మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి - ఆకివీడు

గ్రంథాలయమే విజ్ఞాన సర్వస్వం, అటువంటి గ్రంథాలయానికి ఎటువంటి సహకారమైన అందించడానికి సిద్ధంగా ఉన్నామని లయన్స్ జోన్ చైర్‌పర్సన్ వి.వి.కృష్ణంరాజు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ భవనంలో జరిగిన లయన్స్ జోన్ కార్యక్రమంలో స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంకు రూ.25 వేల విలువైన మైక్ సెట్‌ను గ్రంథాలయ పాలకురాలు కె.పార్వతికి ఆయన విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ పుప్పాల సత్యనారాయణ(పండు), లయన్స్ క్లబ్ ప్రముఖులు, న్యాయవాది నెల్లి సతీష్ కుమార్, దాట్ల రామరాజు, జి.నారాయణరాజు, ఇ.సూర్యనారాయణ రాజు(దిలీప్) పాల్గొన్నారు.

దానశీలి రాధారమణ గుప్త మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రముఖ వాణిజ్య వేత్త, హెచ్‌పి గ్యాస్ డీలర్, దానశీలి బివి రాధా రమణ గుప్త(90) ఆదివారం మృతి చెందారు. ఆయన వయోభారంతో ఇటీవల బాధ పడుతున్నారు. ఆయనకు కుమారుడు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య 4 సంవత్సరాల క్రితం మృతి చెందారు. ప్రజలకు గ్యాస్ అంటే తెలియని రోజుల్లో 1964లో పాలకొల్లులో గ్యాస్ కంపెనీ పెట్టి ఇంటింటికీ గ్యాస్ అలవాటు చేశారు. అప్పట్లో గ్యాస్ పేలిపోతుందని భయపడి విద్యావేత్తలు సైతం కొనేవారు కాదు. వారు బతిమాలి గ్యాస్ అమ్మేవారు. పాలకొల్లు ప్రెస్ క్లబ్, ఛాంబర్, అర్బన్ బ్యాంక్‌లకు స్థల దాతగా ఉన్నారు. పెదగోపురంలో కళ్యాణ మండపంకు ముఖ్య దాతగా ఉన్నారు. కళాకారులను ప్రోత్సహించేవారు. ఆయన చేతుల మీదుగా వందలాది ప్రారంభోత్సవాలు జరిగాయి. ఆయన భౌతిక కాయాన్ని పలువురు పట్టణ ప్రముఖులు సందర్శించారు. ఆయన మృతి పట్ల ఛాంబర్, ప్రెస్ క్లబ్, పలువురు కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

క్రైస్తవ సువార్త సభలకు అనుమతి రద్దుపై నిరసన

ప్రజాశక్తి - తణుకు

శాంతియుతంగా నిర్వహిస్తున్న క్రైస్తవ సువార్త సభలను అర్ధాంతరంగా శనివారం రద్దు చేయడంతో ఆదివారం సాయంత్రం తణుకు పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి నరేంద్ర కూడలి వరకు శాంతి ర్యాలీని నిర్వహించి, రోడ్డుపై మానవహారంగా అనంతరం రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యునైటెట్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ హైస్కూల్ గ్రౌండ్‌లో 10, 11, 12 మూడు రోజుల సభలు నిర్వహించుకోవడానికి తమిళనాడు నుంచి రవిఅబ్రహం పరిచర్యకులని పిలుచుకున్నామన్నారు. సభల నిర్వహణ నిమిత్తం ఎంఎల్ఎ వద్దకు వెళ్లామని తెలిపారు. అక్కడ నుంచి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుని కలిసి మాట్లాడితే 10, 11, 12 నిర్వహించుకోమని తెలిపారన్నారు. కొన్ని రోజుల తరువాత ఒక కవర్ వచ్చిందని 10, 11, 12 తేదీల్లో సభలు నిర్వహించుకోవడానికి వీలు లేదు 12వ తేదీన కార్తీక దీపారాధన ఉన్నదని వెంటనే సభలను కాన్సిల్ చేయాలని చెప్పారన్నారు. అందుకు 9, 10, 11వ తేదీల్లో సభలు పెట్టుకుంటామని తీర్మానం చేసుకున్నామన్నారు. కొన్ని లక్షల రూపాయలతో బ్యానర్లు, పోస్టర్లు, పాంప్లెట్లు, స్టైజీలు ఖర్చుపెట్టామన్నారు. శనివారం సాయంత్రం సభ ప్రారంభం ముందు అధికారులు నిర్వాహకులకు పిలిచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన కారణంగా ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఎటువంటి కార్యక్రమాలకు అనుమతుల లేవని, సభలను రద్దు చేసుకోవాలని తెలిపి హైస్కూల్ గేటుకు తాళాలు వేశారన్నారు. ఎందుకు సభలను అడ్డుకుంటున్నారని అడుగగా ఎప్పుడో న్యాయమూర్తి వారు తీర్మానం ఇచ్చారని, మత పరమైన కార్యక్రమాలు హైస్కూల్ గ్రౌండ్స్‌లో పెట్టకూడదని చెప్పారన్నారు. హైకోర్టు నోటీసులో ఏముందో చూస్తే అటువంటి మాటలు ఏమీ లేవని తెలిపారు. కేవలం హైస్కూల్ గ్రౌండ్స్‌లో రాజకీయ వ్యవహారాలు కాని, ఆఫీసులు పెట్టుకోకూడదని, అటువంటివి ఉంటే వెంటనే కాళీ చేయమని ఆర్డర్స్ ఇచ్చారని తెలిపారు. ఆ ఆర్డర్స్‌ని తీసుకుని జిల్లా సిఇఒ ఆఫీసర్ సొంత ఇష్టంతో మతపరమైన కార్యక్రమాలు హైస్కూలో చేయరాదని జోడించి అన్ని జెడ్‌పి స్కూల్స్‌కి నోటీసులు పంపారని తెలిపారు. పోయిన సంవత్సరం, ఈ సంవత్సరం మట్టి గణపతి ఉత్సవాలు, దీపావళి సంబరాలు దుకాణాలు, ఇప్పటికీ దానికి సంబంధించిన బ్యానర్ బాణాసంచా వ్యాపార సముదాయమని ఉన్నదన్నారు. అది హైస్కూల్ కాదా.. వ్యాపార సముదాయమా అని ప్రశ్నించారు. సంక్రాంతి రోజున ముగ్గులు వేసుకోవాడానికి అవకాశం ఇచ్చారన్నారు. వాళ్లందరికీ ఇచ్చినప్పుడు మాకు ఎందుకు ఇవ్వలేదు అంత వివక్ష ఏంటని ప్రశ్నించారు. మాకు న్యాయం కావాలని కోరారు. ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ వెంటనే జిల్లా కలెక్టర్‌కి, సిఐ, ఎస్ఐకి, జెడ్‌పి చైర్మెన్‌కి ఫోన్ చేశారని, ఎవరికి ఫోన్ చేసినా జవాబు రాలేదని తెలిపారు. తణుకు ఎంఎల్ఎ మాటకి విలువ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎంఎల్ఎ మాట అంటే చెల్లాలని అన్నారు. మాకు ఎటువంటి పార్టీ సంబంధాలు లేవన్నారు. తణుకు పట్టణంలో ఇప్పటి వరకు మత కలహాలు లేవన్నారు. ఈ సభలను ఆపిచేసినందుకు ట్విట్టర్‌లో పోస్టు చేశారని లోకేష్, పవన్‌కళ్యాణ్‌లకు నమస్కారం తెలియజేశారని తెలిపారు. ఇది క్రైస్తవులకు అవమానకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం కావాలని కోరారు.

మానవహారం చేస్తున్న క్రైస్తవులు